క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో..) టమోటా 11, వంకాయ 18, బెండ 28, పచ్చిమిర్చి 45, కాకర 40, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 15, క్యారెట్ 25. దొండ 23, ఆలు 21, ఉల్లి 14, గోకర 40, దోస 18, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 28, చిలగడదుంప 40, బీట్‌రూట్ 25, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 65, కాప్సికమ్ 45. మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం


ప్రహరీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని ఇంజాపూర్ గ్రామానికి చెందిన మహాలక్ష్మి నగర్ కాలనీలో ప్రారంభించిన శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీలోని సమస్యలను పరిశీలిస్తున్న అరవిందరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని ముఖ్యమైన సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వెంకటేశ్వర కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సోమవారం ఆయన కాలనీలో వెలగని వీధి దీపాలు, విస్తరణకు నోచుకోని భూగర్భ డ్రైనేజీ, గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు వంటి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రాంబాబు, ఇతర కాలనీవాసులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు పోలీసులకు అప్పగింత


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: తప్పిపోయిన ఓ బాలుడిని ఆటో డ్రైవర్లు చేరదీసి వనస్థలిపురం పోలీసులకు అప్పగించారు. వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం పనామా చౌరస్తా దగ్గర ఉన్న ఆటోస్టాండ్ ప్రాంతంలో గుర్తు తెలియని ఐదేళ్ల బాలుడు అనూష్ (5) తచ్చాడుతుండగా ఆటో డ్రైవర్లు ఖాదర్, శ్రీను గమనించి చేరదీశారు. సోమవారం సాయంత్రం అతడిని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో సీఐ జలేంధర్‌రెడ్డికి అప్పగించారు. బాలుడితో మాట్లాడిన సీఐ అతడి వివరాలు తెలుసుకున్నారు. తండ్రి నవీన్‌కుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించారు. తప్పిపోయిన బాలుడ్ని గుర్తించి పోలీసులకు అప్పగించిన ఆటోడ్రైవర్లు ఖాదర్, శ్రీనులను సీఐ జలేంధర్‌రెడ్డి అభినందించారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

హుడాకాంప్లెక్స్: జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలంటూ నందనవనానికి చెందిన లబ్ధిదారులు సోమవారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇళ్లకోసం 512 కుటుంబాలు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి నిరసన తెలపగా.. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ వచ్చి.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని వాపోయారు. ఇస్తామన్న ప్రాంతంలో ఇళ్లు ఇవ్వకుండా.. మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ, వనస్థలిపురం రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో కేటాయించారని, తాము అక్కడికి వెళితే అక్కడి ఎరుకల సంఘాలు మాపై దాడికి వస్తూ, ఇక్కడకు రావొద్దని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. శ్రీనివాస్ యాదవ్, రమేష్, స్వామినాథ్, జమీల్ మీరా, స్వామి, భాస్కర్‌నాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

చెత్త కుప్పలు.. ఖాళీ మద్యం సీసాలు!


వనస్థలిపురం డివిజన్‌లోని ప్లేగ్రౌండ్ పార్కులో చెత్త, ఖాళీ మద్యం సీసాలు

- పార్కుల్లో కొరవడిన పారిశుద్ధ్యం
- తాగుబోతులకు అడ్డగా మారుతున్న పార్కులు, పాఠశాలలు
- మద్యం తాగి అక్కడే ఖాళీ సీసాలు పడేస్తున్న వైనం
- చెత్తను తొలగించడంలో కార్మికుల నిర్లక్ష్యం

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హస్తినాపురం, వనస్థలిపురం, లింగోజిగూడ, చంపాపేటల్లోని పలు ప్రాంతాల్లో కాలనీల్లోని రోడ్లపైన, పార్కుల్లోను చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతోంది. పోలీసుల నిఘా కొరవడంతో కొన్ని పార్కులు, పాఠశాలల ఆవరణలో తాగుబోతులకు అడ్డగా మారుతున్నాయి.

- వనస్థలిపురం డివిజన్ పరిధిలోని రామాలయం పక్కనే ఉన్న పోచమ్మ ఆలయం ప్రాంగణంలోని ప్లేగ్రౌండ్ పార్కులో చెత్తకుప్పలు పేరుకుపోయి ఉన్నాయి.
- కొందరు తాగుబోతులు మద్యం తాగి ఖాళీ సీసాలను పార్కులో పడేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా వాకింగ్‌కు, సేద తీరేందుకు పార్కుకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.
- పార్కుల్లో మద్యం సీసాలు, చెత్తాచెదారం దర్శనం ఇస్తుండటంతో మహిళలు పార్కుకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు.
- ఇలా ఉండగా, ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ తాగుబోతులకు అడ్డగా మారింది.
- పోలీసులు నిఘా లేకపోవడంతోనే తాగుబోతులు రాత్రిపూట పాఠశాల ఆవరణలో తిష్టవేసి మద్యం తాగుతూ గోలగోల చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.
- చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకొనే చోట మద్యం తాగితే ఎలా అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.
- సర్కిల్ పరిధిలోని పార్కులు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో తాగుబోతులు తిష్టవేసి మద్యం తాగకుండా ఉండేందుకు వనస్థలిపురం డివిజన్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి రాత్రి పూట నిఘాను పెంచాలని కోరారు.


భూపేశ్‌గుప్తానగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తాగిపడేసిన మద్యం సీసాలు

- అలాగే, పార్కుల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కుల్లో మహిళలు తిరిగే పరిస్థితి లేదు



వనస్థలిపురం నియోజకవర్గంలోని పార్కులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నా..వాటిని పర్యవేక్షించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పార్కుల్లో చెత్తకుప్పలు, ఖాళీ మద్యం సీసాలు దర్శనం ఇస్తుండటంతో మహిళలు పార్కుల్లో తిరిగే పరిస్థితి లేకుండాపోతోంది. వనస్థలిపురంలోని పోచమ్మ టెంపుల్ ప్రాంగణంలోని పార్కులో నెలల తరబడి పేరుకుపోయిన చెత్తను ఎందుకు తొలగించడంలేదో అర్థం కావడంలేదు. చెత్తకుప్పలు వేసిన ప్రాంతంలో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ప్రతినిత్యం పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లు ఈ పార్కులోకి వస్తున్నా చెత్తను తొలగించడంలేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎ.మాధవి, గృహిణి, వనస్థలిపురం

ఎఫ్‌టీఎల్ జీఓ ఉపసంహరణకు విజ్ఞప్తి చేస్తాం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీని ఎఫ్‌టీఎల్‌గా గుర్తిస్తూ 2008వ సంవత్సరంలో తీసుకొచ్చిన జీఓను ప్రభుత్వం ఉపసంహరించుకొనేలా ప్రయత్నాలు మొదలు పెట్టనున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. గ్రీన్ పార్క్ కాలనీ సమస్యలపై అన్ని విభాగాల అధికారులతో కలిసి కాలనీలో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎఫ్‌టీఎల్ జీఓ కారణంగా కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని, ఎఫ్‌టీఎల్ బయట ఉన్న వాటికి కూడా అనుమతులు రావడం లేదన్నారు. కాలనీ సమస్యలపై గతంలో అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌లను కలిసి విన్నవించామన్నారు. ప్రస్తుత కలెక్టర్ హరీష్‌ను కూడా కలిసి ఈ విషయాన్ని వివరించామన్నారు. 2014లో ఆర్‌వీ సొల్యూషన్స్, జీహెచ్‌ఎంసీం అధికారులు కలిసి సర్వే చేశారని, ఆ సమయంలో కాలనీ వాసులు వారితో గొడవపడటంతో కాలనీ మొత్తాన్ని ఎఫ్‌టీఎల్‌లో చేర్చారని తెలిపారు. దీని కారణంగా కాలనీలో 800 కుటుంబాల వారు ఇబ్బందిపడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. రీసర్వే చేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు. కాలనీవాసులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండు రోజుల్లో సర్వే చేయిస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ సూరజ్, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, కాలనీ అధ్యక్షుడు కమలేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, సభ్యులు నర్సిరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, తిలక్‌రావు, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

నాగోలు: కంటి వెలుగు కార్యక్రమాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అన్నారు. న్యూ నాగోలు కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కాలనీ ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యాధికారులు ఇచ్చే కళ్లద్దాలను తీసుకొని వాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నందికొండ గీతారెడ్డి, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జ్ఞానకుమార్, వైద్యాధికారి పాహిస్తా ఫిర్దోస్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసులకు ఇబ్బందులు రానీయొద్దు

కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ డీసీ కృష్ణయ్య, డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. కాలనీవాసుల నుంచి రోడ్లు, డ్రైనేజ్ శానిటైజేషన్, దోమలు, తాగు నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో ఏఈ మాత్యానాయక్, స్కూల్ హెడ్మాస్టర్ ఆంజనేయులు, కాలనీ అధ్యక్షుడు గజేందర్ సింగ్, సెక్రెటరీ సత్యనారాయణ, వాటర్ వర్క్స్ అధికారులు సత్యనారాయణ, దయాకర్, లక్ష్మయ్య, విజయభారతి, రుక్కమ్మ, కాలనీ వాసులు నర్సింహ, భూషణం పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి

ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ పిలుపునిచ్చారు. ఆర్‌కేపురం డివిజన్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం చిత్ర లేఅవుట్‌లో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈనెల 25 న విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రా రెడ్డి నేతృత్వంలో జరగబోయే సమావేశానికి డివిజన్ నుంచి వందలాది మంది కార్యకర్తలతో తరలి వెళ్లడానికి రూట్ మ్యాప్ ను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాచారి, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, లింగస్వా మి గౌడ్, గొడుగు శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, శ్యాం గుప్తా,జగిని రమేష్ గుప్తా, జగన్, శేఖర్, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ సునీత రెడ్డి, మారం సుజాత రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆవిర్భావ వేడుకలు

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు, ఎల్‌బీనగర్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఉదయం 10 గంటలకు మన్సూరాబాద్ డివిజన్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తామని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మన్సూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనలు, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో ఆవిర్భావ వేడుకలను, ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథులుగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, డివిజన్ల కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు అజంపురాలో 'మలక్‌పేట' సమావేశం

చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం అజంపురాలోని ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని మలక్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఆజం అలీ తెలిపారు. సోమవారం ఆయన మలక్‌పేటలో పార్టీ డివిజన్ల అధ్యక్షులు, ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. నియోజకవర్గ కార్యకర్తల సర్వసభ్య సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలందరినీ తరలించాలని సూచించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వికలాంగ హక్కుల నాయకులు

చాదర్‌ఘాట్: దివ్యాంగుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అఖిల భారతీయ వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర రావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సంఘం ప్రతినిధులతో కలిసి రాష్ట్ర వికలాంగుల శాఖ కమిషనర్ శైలజను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, స్వయం ఉపాధి కింద దివ్యాంగులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అర్హులైన దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు భిక్షపతి, శ్రావణ్, గోవిందరాజు, ఫాతిమా, బాలకృష్ణ, రాఘవేందర్, యాదగిరి, నరేష్, శంకర్ పాల్గొన్నారు.

'కామినేని'లో ఉచిత సంతాన సాఫల్య శిబిరం


సంతాన సాఫల్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వసుంధర కామినేని, ఇతర వైద్యులు

మన్సూరాబాద్: దేశంలో సంతాన లేమి అనేది ముఖ్యమైన సమస్యగా ఉందని, ఈ విషయంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అందుబాటులో ఉన్న చికిత్సలపై అవగాహన కల్పించడం కీలకమని కామినేని హాస్పిటల్స్ ప్రసూతి, గైనకాలజీ హెడ్, కామినేని ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వసుంధర కామినేని అన్నారు. నేషనల్ ఇన్‌ఫెర్టిలిటీ అవేర్‌నెస్ వారోత్సవాల సందర్భంగా ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో దంపతులకు ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వసుంధర మాట్లాడారు. సోమవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు, ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉచిత స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. దంపతులు హాజరై సంతానం కోసం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అల్ట్రాసౌండ్ , హెచ్‌బీ శాతం, వీర్యం విశ్లేషణ, వైద్యుల సంప్రదింపులు ఉచితంగా చేస్తామన్నారు. అనంతరం ఉచిత సంతాన సాఫల్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ మేనక, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో సమయం వృథా చేయొద్దు


విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న దృశ్యం

చంచల్‌గూడ: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ హైదరాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ రజిత అన్నారు. సోమవారం చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షల రిపోర్టు కార్డులు అందజేసే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు సెలవుల్లో టీవీలు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా పెయింటింగ్, డ్రాయింగ్, పజిల్స్, ఇండోర్ గేమ్స్ నేర్చుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నేర్చుకోవాల్సిన పాఠాలను ప్రతిరోజు గంట పాటు చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంద వెంకట్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ నెహ్రూబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

డివిజన్ అభివృద్ధిలో రాజీపడం


కాలనీ సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్, అధికారులు

మలక్‌పేట: డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఫ్రెండ్స్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వీధి దీపాల స్తంభాల ఏర్పాటు, వీధి లైట్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు, రోడ్లకు మరమ్మతు వంటి పనులు చేపట్టాలని, మ్యాన్‌హోళ్ల సమస్యలు పరిష్కరించాలని, రాత్రి సమయాల్లో పోలీస్ గస్తీ పెంచాలని అధికారులను కాలనీవాసులు కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు పేర్కొన్న సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించేందుకు చర్యలు తీ సుకుంటామన్నారు. కాలనీ ప్రెసిడెంట్ రావూఫ్, సెక్రటరీ రవీంద్రకుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, నోడల్ ఆఫీసర్ బన్సీలాల్‌కుమార్, జ లమండలి ఏఈ చంద్రునాయక్, ఎస్సై శృతిరెడ్డి పాల్గొన్నారు.

'జనప్రియ హోమ్స్'లో పర్యటించిన కార్పొరేటర్

వనస్థలిపురం: జనప్రియ హోమ్స్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్-రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇంట్రాక్షన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి జనప్రియ హోమ్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ సాయి శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీ అధ్యక్షుడు పవన్, నాయకులు చిన్నయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.


కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

నాణ్యతతో రోడ్డు పనులు చేపట్టాలి


జెల్లయాదవనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: నిర్దిష్టమైన ప్రణాళికలతో డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి జెల్లయాదవనగర్ కాలనీలో సోమవారం ఆయన మార్నింగ్‌వాక్ చేసి కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు పనులు పూర్తి చేస్తున్నామన్నారు. కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాలనీలో విద్యుత్‌స్తంభాలు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శివయాదవ్, నర్సింహ, శ్రీకాంత్‌యాదవ్, రామారావు, నాయకులు కడారి యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురా నియోజకవర్గ అభివృద్ధికి కృషి


సామ సుందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నియోజకవర్గ నాయకులు

సైదాబాద్: ప్రభుత్వ పెద్దల సహకారంతో యాకుత్‌పురా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఐఎస్ సదన్ డివిజన్ భానునగర్‌లోని నివాసంలో ఆయన జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని టీఆర్‌ఎస్ నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, గున్న మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్, శివకుమార్, పాల్గొన్నారు

ఘనంగా వార్షికోత్సవం

హయత్‌నగర్: డివిజన్‌లోని అన్మగల్ హయత్‌నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ 4వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. హోమం, బోనాల సమర్పణ అనంతరం అన్నదానం చేశారు. వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు ముద్దగోని లక్ష్మీప్రసన్న పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పాల్గొన్న లక్ష్మీప్రసన్న తదితరులు

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం

వైభవంగా జరుగుతున్న అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయ 27వ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 4వ రోజైన సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల బ్రహ్మోత్సవాల మధ్య ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆదివారం రాత్రి నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణులు రెండు జట్లుగా విడిపోయి నారాయణ స్వామి, అష్టలక్ష్మి అమ్మవారి గుణగణాలను, గొప్పతనాన్ని శ్లాఘిస్తూ వేడుక నిర్వహించారు అనంతరం భక్తుల కోలాహలం మధ్య అశ్వవాహన సేవ జరిగింది. ఈ సందర్భంగా జగద్గురు ఆది శంకరాచార్య జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉన్నత విద్యాప్రాప్తికి కోసం శ్రీహయగ్రీవేష్టి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు గంప జగన్, ఐతే అంజయ్య గుప్తా, గౌరిశెట్టి అరుణ్, బాలగోపాల్, బొగ్గరపు రవీందర్, దాచేపల్లి శ్రీనివాస్, తమ్మన శ్రీధర్, శ్రీకాంత్ గాండే, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


వేడుకను తిలకిస్తున్న భక్తులు